క్లుప్తంగా

పేద మహిళలకు చీరల పంపిణీ



తెనాలి అర్బన్: తెనాలి పట్టణ ఆర్యవైశ్య సంఘం, వాసవీ సేవాదళ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాధు ప్రతాప్‌కుమార్ పుట్టిన రోజు సందర్భంగా బోసు రోడ్డులోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థాన ఆవరణలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు మద్ది మల్లికార్జునరావు, బొంత ఆంజనేయులు, కోణిజేటి గోపి, ఎస్.వి.బ్రహ్మం, శంకర్‌నారాయణ, శివ నరసింహారావు, శ్రీధర్, ధర్మేంద్ర పాల్గొన్నారు.

దాడి, దోపిడీ కేసులో జైలు, జరిమానా

తెనాలి రూరల్: వ్యక్తిపై దాడి చేసి ఫోన్ లాక్కు వెళ్లిన ఘటనలో నిందితులకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తెనాలి రైల్వే స్టేషన్ వద్ద గతేడాది ఏప్రిల్ 6న ఓ వ్యక్తిపై ముగ్గురు యువకులు దాడి చేసి గాయపర్చి అతని వద్ద ఉన్న సెల్ ఫోన్ లాక్కు వెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ ఎస్ఐ ఎం. విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి, నిందితుల్ని పట్టణానికి చెందిన గడ్డం రాజు, చంపల మణికంఠ, మూకిరి గోపి, కన్నెగంటి మోహన్‌కృష్ణగా గుర్తించి కోర్టులో హాజరుపరిచారు. కేసు సోమవారం విచారణకు రావడంతో సాక్ష్యాధారాల్ని పరిశీలించిన ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా, నిందితులకు ఆరు నెలల జైలుశిక్ష, రూ. 400 చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ ఏపీపీ పి. సునీల్‌కుమార్ వాదించారు.

కళాకారుడు, గాయకుడు శాంసన్‌కు సన్మానం



తెనాలి అర్బన్: నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో సోమవారం సరదారాముడు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. మంగళవారం భట్టివిక్రమార్క చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం కళాకారుడు, గాయకుడు తురిమెళ్ల శాంసన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాదల కోటేశ్వరరావు, పినపాటి రవీంద్ర, సోమవరపు సాంబశివరావు, పెమ్మసాని పోతురాజు, గుమ్మడి ప్రసాద్, వ్రతం శ్రీనివాసరావు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఈదర శ్రీనివాసరావు, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, దేవిశెట్టి భాస్కర్, ముళ్లపూడి వెంకట్, నల్లూరి శ్రీనివాస్, సుబ్బారావు పాల్గొన్నారు.

కోర్సులపై పదో తరగతి విద్యార్థులకు అవగాహన



తెనాలి టౌన్: బుర్రిపాలెం రోడ్డులోని వెస్ట్‌బెర్రి స్కూలులో పదో తరగతి పాసైన విద్యార్థులు భవిష్యత్‌లో తీసుకోవాల్సిన కోర్సులు, ప్రాముఖ్యతపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లు ఆధ్వర్యంలో కేరీర్ నెక్స్ట్ అనే అంశంపై జరిగిన సదస్సులో సీబీఎస్ఈ కో–ఆర్డినేటర్ హిమబిందు, ఐడీపీ ఇంగ్లిష్ ఫ్యాకల్టీ డోనా రేచెల్ సామ్ విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. సమగ్రాభివృద్ధిపై చర్చించారు. విద్యార్థుల ఆసక్తి, ఆలోచనల బట్టి వారు భవిష్యత్‌లో ఎటువంటి కోర్సులు చేస్తే రాణించగలుగుతారో, ఎటువంటి అవకాశాలు వస్తాయో లాంటి విషయాలను తెలియజేశారు. కార్యక్రమంలో వెస్ట్‌బెర్రి స్కూల్ ప్రిన్సిపల్ కె.శేషులత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటిలో చోరీ

గుంటూరు ఈస్ట్: ఇంటిలో చోరీపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. నర్రా పవన్‌కుమార్ బ్రాడీపేటలో ఉన్న తన ఇంటికి తాళాలు వేసి బంధువుల ఇళ్లల్లో నివసిస్తున్నాడు. శుక్రవారం ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలకెళ్లి పరిశీలించగా, టీవీ, నీళ్ల మోటారు చోరీకి గురైనట్లు గుర్తించాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్టు

పేకాట ఆడుతున్న నలుగురిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కళాకారుల కాలనీలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం సోమవారం పోలీసులు దాడి చేశారు. నలుగురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ. 5,200 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రంజాన్‌ను సంతోషంగా జరుపుకోవాలి

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే శివకుమార్



మసీదులో జరిగిన నమాజ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి అర్బన్: రంజాన్ పండుగను ముస్లింలందరూ సంతోషంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆకాంక్షించారు. మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభాని ఆధ్వర్యంలో నందులపేటలోని ఆయేష మసీదులో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందును ఆయన ప్రారంభించారు. ముందుగా మసీదులో ముస్లిం మత పెద్దలతో కలసి నమాజ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముస్లింలు ఎంతో నిష్టగా ఉపవాసంతో అల్లాను ప్రార్థిస్తారని చెప్పారు. అల్లా దయ అందరికి ఉండాలని కోరుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు షేక్ దుబాయ్‌బాబు, షేక్ ఇస్మాయేల్, తోట రఘురామ్, గుంటూరు కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ రియాజ్‌ఖాన్, అక్కిదాసు కిరణ్, గ్యాస్ సుభాని, షేక్ మీరావలి, తాడిబోయిన రమేష్, టెక్స్ బాల, సాయిబాబా మాస్టార్, జామియా మసీదు అధ్యక్షుడు సుభాని, ఆయేష మసీదు కార్యదర్శి రియాజ్, ముస్లిం మత పెద్దలు చాంద్‌బాషా, జాని, జాకీర్, బాజి, బ్రిటిష్ పాల్గొన్నారు.

'మా నమ్మకం నువ్వే జగనన్న'కు ఆదరణ



37వ వార్డులో ప్రచారం చేస్తున్న కౌన్సిలర్ సువర్ణరేఖాదేవి



30వ వార్డులో కౌన్సిలర్ జయపాల్ తదితరుల ప్రచారం



32వ వార్డులో బుక్‌లెట్ అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు రాజేశ్వరరావు

తెనాలి అర్బన్: జగనన్నే మా భవిష్యత్– మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. ఇంటింటా జయహో జగన్ నినాదం హోరెత్తుతోంది. వైఎస్సార్ సీపీ నాయకులకు ప్రజల నుంచి అపూర్వ స్వాగతం లభిస్తోంది. తెనాలి పట్టణంలోని దాదాపు అన్ని వార్డుల్లో సోమవారం కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని వివరించారు. లబ్ధిదారుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న అనే స్టిక్కర్లను ప్రతి ఇంటికీ అంటించారు. 30, 37 వార్డుల్లో కౌన్సిలర్లు కొమ్మరబత్తుని జయపాల్, మల్లిబోయిన సువర్ణరేఖాదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు మల్లిబోయిన రాములు ఆధ్వర్యంలో గృహ సారథులు వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేశారు. 32వ వార్డులో వైఎస్సార్ సీపీ నేత మట్లపూడి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రతి ఇంటికీ వెళ్లి బుక్‌లెట్లను అందజేశారు. స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో ఆయా వార్డుల గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వార్డు వలంటీర్లు, వైఎస్సా సీపీ నాయకులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం



ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరిస్తున్న సిబ్బంది

తెనాలి రూరల్: అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఆందోళన చెందకుండా సమన్వయంతో వ్యవహరించాలని తెనాలి సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి కె. కృష్ణారెడ్డి విద్యార్థులకు సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన సోమవారం స్థానిక వివేక సెంట్రల్ స్కూలులో విద్యార్థులకు ప్రమాదాల నివారణ, అవి జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యల గురించి అవగాహన కల్పించారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ వేసవిలో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రమాద బాధధితులకు స్వచ్ఛమైన గాలి అందేలా చూడాలని, కాలి గాయాలయితే వెంటనే వైద్యుల్ని సంప్రదించాలని సూచించారు. ప్రమాదాలు సంభవించినప్పుడు సురక్షితంగా బయటపడడం, మంటల్ని అదుపు చేయడాన్ని ప్రదర్శించారు. విషవాయువులలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు వినియోగించే బీఏ సెట్ పరికరం పనితీరును వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు. వివేక విద్యా సంస్థల డైరెక్టర్ రావిపాటి వీరనారాయణ పర్యవేక్షించారు.

జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కోటేశ్వరరావు



నూతన కార్యవర్గం

తెనాలి: గుంటూరు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా పి.వి.కోటేశ్వరరావు కార్యదర్శిగా ఎస్.నిరంజన్‌రావు ఎన్నికయ్యారు. స్థానిక బాలాజీరావుపేటలోని ఘంటా హనుమయ్య సత్రంలో సోమవారం సాయంత్రం జరిగిన సమావేశంలో 2023–2027 సంవత్సరాలకు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా జె.సింగారావు, జి.ఎస్.రామకృష్ణ, కె.రవిశేఖర్ రెడ్డి, ఎం.శ్రీనివాసరావు, డి.కృష్ణప్రసాద్, జి.వెంకట నారాయణ, వి.సురేష్‌బాబు, టి.రవికుమార్, సంయుక్త కార్యదర్శులుగా జి.కె.ఎస్. విజయ్‌చంద్, ఎస్.ఏడుకొండలురెడ్డి, బి.హైమారావు, కోశాధికారిగా జె.మహినాథ్‌తోపాటు మరో 11 మంది కార్యవర్గసభ్యుల్ని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా జి.గోపీచంద్, చీఫ్ పాట్రన్స్‌గా డి.నరేంద్రకుమార్, ఎల్‌వీఆర్ అండ్ సన్స్ గుంటూరును ఎన్నుకున్నారు. పరిశీలకులుగా ఏపీ వాలీబాల్ అసోసియేషన్ వైస్ చైర్మన్ సి.మాలకొండయ్య, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు వ్యవహరించారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలు చిరస్మరణీయం



దేవానంద్‌కు పుస్తకాలు అందజేస్తున్న రచయిత గోపాలరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ వృత్తి నుంచి భారతదేశ అత్యున్నత పీఠమైన రాష్ట్రపతి పదవిని అలంకరించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ పేర్కొన్నారు. సోమవారం మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి సందర్భంగా అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేవానంద్ మట్లాడుతూ ప్రథమ ఉప రాష్ట్రపతి, రెండవ రాష్ట్రపతిగా భారతీయ తాత్విక చింతనలో పాశ్చాత్య తత్వాన్ని ప్రవేశపెట్టిన రాధాకృష్ణన్ దేశానికి ప్రపంచ దేశాల్లో గుర్తింపు తెచ్చారని తెలిపారు. రెండుసార్లు ఉప రాష్ట్రపతి పదవితో పాటు రాష్ట్రపతిగా చైనా, పాకిస్తాన్ యుద్ధ సమయంలో ప్రధానులకు మార్గనిర్దేశం చేశారని వివరించారు. అనంతరం రచయిత ఉప్పల గోపాలరావు రచించిన 'ఒక సామాజిక స్పృహ గల కార్యకర్త ఆలోచనలు–అభిప్రాయాలు', 'నా మాటల మూట' అనే రెండు పుస్తకాలను జిల్లా కేంద్ర గ్రంథాలయానికి బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ యం.సీతారామయ్య, లైబ్రేరియన్ కె.చిన్నపరెడ్డి, యస్.నాగిరెడ్డి, టైపిస్టు కె.శ్రీనివాసరావు, జి.రాజేష్, జూనియర్ అసిస్టెంట్ జి.శ్రీనివాసులు, యం.సంజయ్, కె.పూర్ణచంద్రరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలి

అదనపు కమిషనర్ పెద్ది రోజా

నెహ్రూనగర్: సమస్యలపై ప్రజల నుంచి అందే ఫిర్యాదుల్ని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని, నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, సచివాలయ కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తప్పవని అదనపు కమిషనర్ పెద్ది రోజా స్పష్టం చేశారు. కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ సోమవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలని ఆదేశించారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫోటోలు జత చేయాలని సూచించారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 52 ఫిర్యాదులు అందాయన్నారు. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి 19, ఇంజినీరింగ్ విభాగానికి 20, ప్రజారోగ్య విభాగానికి నాలుగు, రెవెన్యూ విభాగానికి ఎనిమిది, ఉపా సెల్ విభాగానికి ఒకటి చొప్పున ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఫిర్యాదుల్ని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సీహెచ్. శ్రీనివాస్, ఎస్ఈ భాస్కర్, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, సీఎంఓహెచ్ డాక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు ప్రభాకరరావుకు అవార్డు



వల్లభాపురం(కొల్లిపర): మండలంలోని వల్లభాపురం ఎల్ఈ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు నాదెండ్ల ప్రభాకరరావు పూలే టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే ఎక్సలెన్స్– 2023 అవార్డును అందుకున్నారు. తిరుపతిలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రాంగణంలో ఆదివారం హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్ ఆయనకు అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా సోమవారం ఎంఈవో ఎం.లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు వహబ్ ఎన్‌కే సత్తార్ , టి.రాము, సీఆర్పీ మురళి తదితరులు ప్రభాకరరావును అభినందించారు.

'మట్టి పరీక్ష–శిక్షణ వారం' కార్యక్రమానికి శ్రీకారం



తెనాలి టౌన్: రూరల్ మండలం కొలకలూరు–1 రైతు భరోసా కేంద్రంలో సోమవారం మట్టి పరీక్ష– శిక్షణ వారం కార్యక్రమానికి సోమవారం వ్యవసాయాధికారులు శ్రీకారం చుట్టారు. మండల గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వీఏఏలు, వీహెచ్ఏలు, ఎంపీఈవోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ మట్టి పరీక్షలు ఆవశ్యకత, తీసే విధానం, గుంటూరు ల్యాబ్‌కు పంపే విధానం గురించి తెలియజేశారు. పొలంలోని నాలుగు ప్రాంతాలల్లో మట్టిని సేకరించి, ప్లాస్టిక్ కవరులో ఉంచి దానిపై రైతుకు సంబంధించిన సమాచార పత్రాన్ని ఉంచి ల్యాబ్‌కు పంపించాలని సూచించారు. అనంతరం హాఫ్‌పేట గ్రామ పరిధిలోని పొలంలో వ్యవసాయ సహాయకులు, అగ్రికల్చరల్ బీఎస్సీ విద్యార్థులు కలసి మట్టి నమూనాను సేకరించారు. కార్యక్రమంలో ఏఈవో మోహన్, గుంటూరు హిందూ కళాశాల అగ్రికల్చరల్ బీఎస్సీ విద్యార్థులు, కొలకలూరు, హాఫ్‌పేట ఆర్బీకేల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉద్యమ నెల బాలుడు సత్యమూర్తి



నెహ్రూనగర్: సామాజిక న్యాయ, స్వయం గౌరవ పోరాట యోధుడు కేజీ సత్యమూర్తి అని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ తెలిపారు. అరండల్‌పేటలోని భీమ్ భారత్ కార్యాలయంలో సోమవారం సత్యమూర్తి 11వ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నల్లపు నీలాంబరం అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరై పాగళ్ల ప్రకాష్ మాట్లాడుతూ ప్రజా ఉద్యమంలో నెల బాలుడు పాత్ర పోషించిన కేజీ సత్యమూర్తి బడుగు, బలహీన వర్గాల హక్కుల సాధనకై నిరంతరం శ్రమించిన గొప్ప మేధావి అని కొనియాడారు. ముందుగా సత్యమూర్తి చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో భీమ్ భారత్ రాష్ట్ర నాయకులు జల్ది మోహన్, మహిళా నాయకురాలు రావినూతల కమల కుమారి, ఆంధ్రప్రదేశ్ రజక వత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జూపూడి శ్రీనివాసరావు, దళిత పరివర్తన సంఘం నాయకులు జొన్నలగడ్డ శ్రీకాంత్, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి బత్తుల అనిల్ ప్రసంగించారు.

కుల దూషణపై కేసు నమోదు

పట్నంబజారు: కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాత గుంటూరులోని క్రిస్టియన్‌పేటలో నివాసం ఉండే బి.రవికుమార్‌కు లక్ష్మిశెట్టి అనిల్‌కుమార్ డబ్బులు ఇవ్వాలి. ఈ నేపథ్యంలో రవికుమార్ న్యాయవాదుల ద్వారా అనిల్‌కుమార్‌కు నోటీసులు పంపాడు. ఈ క్రమంలో భాస్కర్ థియేటర్ సమీపంలో ఎదురుపడిన రవికుమార్‌ను అనిల్‌కుమార్ కులం పేరుతో దూషించి దాడి చేశాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

19న డిగ్రీ విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయ పరిధిలోని కళాశాలల్లో చదువుతున్న డిగ్రీ తృతీయ సంవత్సర విద్యార్థులకు ఈనెల 19న అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు బీకాం, బీఎస్సీ, బయాలాజికల్ సైన్స్, బీ ఫార్మసీ, నర్సింగ్ విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థపై వస్తు సేవల పన్ను ప్రభావంపై బీకాం విద్యార్థులకు, ఆరోగ్య నిర్వహణ, పునర్వ్యవస్థీకరణలో పోషణ–ఆహారం పాత్రపై బీఎస్సీ బయాలాజికల్ సైన్సెస్ విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు నగదు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9703284136, 9440886535 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

లైఫ్ స్కిల్స్‌తోనే మెరుగైన జీవితం

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని

తెనాలి: చదువుకే కాదు.. మెరుగైన జీవితం గడిపేందుకు జీవన కళలు (లైఫ్ స్కిల్స్) ఆవశ్యకత ఎంతగానో ఉంటుందని, ఉద్యోగం వచ్చింది కదాని ఆ ప్రాక్టీస్‌ను నిలిపి వేయొద్దని ఏఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సలహానిచ్చారు. క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాల్ని సాధించిన స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ ఫైనలియర్ విద్యార్థుల సక్సెస్ మీట్‌ను సోమవారం నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే శివకుమార్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, జీవితం ఎవరికీ వడ్డించిన విస్తరి కాదన్నారు. ఫెయిల్యూర్స్ నుంచి గెలుపు బాటలో అడుగుపెట్టటమే సిసలైన సక్సెస్‌గా చెప్పారు. కాలేజీ ప్రవేశపెట్టిన జీవన కళల శిక్షణ స్థితిగతుల్ని మార్చిందని విద్యార్థులు చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. జీవన కళల ప్రాక్టీస్‌ను కొనసాగించాలని హితవు పలికారు. ఉద్యోగం సాధించడంతోనే లక్ష్యం నెరవేరినప్పటికీ, జీవితం ఇంకా ఎంతో ఉందన్నారు. ఈ వయసులోనే మంచి నిర్ణయాలను తీసుకోవాలని, వాటిని అమలుచేసే సామర్థ్యం ఇప్పుడే ఉంటుందని తెలిపారు. మనం తీసుకునే నిర్ణయమే మన ఎదుగుదలకు తోడ్పడుతుందని స్పష్టంచేశారు. ఆ నిర్ణయమే మెరుగైన జీవితానికి పునాది కావాలని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ తన ప్రసంగంలో వివిధ డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌తో ఒప్పందం కుదుర్చుకోవడం, విద్యార్థులకు ఉద్యోగావకాశాల్ని పెంచిందని తెలిపారు. ప్రస్తుత ఐటీ రంగంలో మాంద్యం ఏర్పడినప్పటికీ, తమ విద్యార్థులు నాన్ ఐటీ కంపెనీల్లోనూ ఉద్యోగాలను సాధిస్తున్నారని గుర్తుచేశారు. తొలుత పలువురు విద్యార్థిని, విద్యార్థులు కాలేజీలో అలవరుస్తున్న జీవన కళలు తమ ఎదుగుదలకు ఎలా ఉపకరించిందీ వివరించారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



కొల్లిపర గ్రామంలో డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ పద్మావతి

కొల్లిపర: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని ఎంపీపీ భీమవరపు పద్మావతి, సర్పంచ్ పిల్లి రాధిక తెలిపారు. సోమవారం కొల్లిపర గ్రామంలోని సగరరాజు కాలనీలో రూ.2.50 లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎంపీపీ పద్మావతి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పరిపాలన కొనసాగిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలు రానున్న రోజుల్లో మరలా పట్టం కట్టాలని కోరారు. సర్పంచ్ రాధిక మాట్లాడుతూ కొల్లిపరలో డ్రైనేజీ నిర్మాణానికి సీఎం జగనన్న ఆశీర్వాదంతో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సహకారంతో రూ.60లక్షలు మంజూరు చేశారని తెలిపారు. ఈ నిధులతో త్వరలో పూర్తి స్థాయిలో డ్రైనేజీ నిర్మాణాల్ని పూర్తి చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జొన్నల శివారెడ్డి, వార్డు మెంబర్లు అవుతు బ్రహ్మారెడ్డి, ముద్దరబోయిన వెన్నెల పాల్గొన్నారు.

ప్రశ్నించే తత్వంతోనే మనిషి ఎదుగుదల



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చైతన్య ప్రిన్సిపాల్ తిరుపతిరావు

తెనాలి అర్బన్: ప్రశ్నించే తత్వంతోనే మనిషి ఎదుగుదల సాధ్యమని, విద్యార్థులంతా దాన్ని అలవర్చుకోవాలని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.అబ్రహాం లింకన్, చైతన్య ఐఐటీ క్యాంపస్ ప్రిన్సిపాల్ బి.తిరుపతిరావు సూచించారు. ఎన్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఫేర్‌వెల్ డే వేడుకల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలో వస్తున్న సాంకేతిక మార్పుల్ని అందిపుచ్చుకోవాలని, ఇది ఇంజనీరింగ్ విద్యకు ఎంతో దోహదపడుతుందని చెప్పారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్, ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.రామారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దళితవాడలు, మత్స్యకారుల కాలనీల్లో దేవాలయాల నిర్మాణం



సభ్యులతో మాట్లాడుతున్న సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర మహిళా కన్వీనర్ ఇందిరాదేవి

తెనాలి టౌన్: పట్టణ ముత్తెంశెట్టిపాలెంలోని దళితవాడలో శ్రీ కోదండ రామాలయ నిర్మాణ పనుల్ని సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) రాష్ట్ర మహిళా కన్వీనర్ ఇందిరాదేవి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీటీడీ మంజూరు చేసిన రూ.10లక్షలతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో దళితవాడలు, మత్స్యకార ప్రాంతాల్లో హిందూ ధర్మాన్ని నిలబెట్టడం కోసం దేవాలయ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 320 దేవాలయాలకు అనుమతి లభించిందని, మే, జూన్ నెలల నాటికి త్వరితగతిన పూర్తి చేసి ప్రతిష్ఠ కార్యక్రమాల్ని నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం దేవాలయ కమిటీ సభ్యులతో ఆమె సమావేశమయ్యారు. ఆలయ నిర్మాణాలపై పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ధర్మప్రచారక్ జంజనం హేమశంకరరావు, జిల్లా పరియోజన ప్రముఖ్ పడమట వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు దారా చిన ఆంజనేయులు, చిన యేసు, బుస్సా సుబ్బారావు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిలదీయాలి



ర్యాలీలో పాల్గొన్న జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్

తెనాలి అర్బన్: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాల్ని ప్రజలందరూ నిలదీయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై సీపీఐ, సీపీఎం సంయుక్త ఆధ్వర్యంలో కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న ప్రచార భేరి సోమవారం పట్టణంలో కొనసాగింది. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నేతలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతోన్మాద బీజేపీని దేశం నుంచి సాగనంపాలని కోరారు. మోదీ ప్రభుత్వం ప్రజల మధ్య మతచిచ్చు పెట్టి వివాదాలు సృష్టిస్తోందని ఆరోపించారు. ప్రజలందరూ సంయమనం పాటించాలని సూచించారు. పేదలకు విద్య, వైద్యం అందని ద్రాక్షలా ఉందని విమర్శించారు. ఉపాధి హామీ పథకాన్ని మోదీ ప్రభుత్వం నీరుగార్చిందని విమర్శించారు. అనంతరం బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్‌బాబు, సీపీఎం నాయకులు ములకా శివసాంబిరెడ్డి, షేక్ హుస్సేన్‌వలీ, మహిళా నాయకురాలు రాజ్యలక్ష్మి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్, ఏఐవైఎఫ్ నాయకులు పల్నాటి నాగరాజు, బిల్లా రాజేష్ పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

గుంటూరు రూరల్: పాలిటెక్నిక్ కోర్సుల ప్రవేశ పరీక్ష పాలిసెట్‌కు ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు నల్లపాడు ఎంబీటీఎస్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ టి.శేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లపాడులోని ఎంబీటీఎస్ కళాశాలలో జరిగే ఈ ఉచిత శిక్షణ తరగతుల్లో పదవ తరగతి పూర్తి చేసిన, పరీక్షలు రాసిన అభ్యర్థులు చేరవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 18 నుంచి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులకు ఉచిత మెటీరియల్, వసతులు కల్పించనున్నట్లు తెలియజేశారు. వివరాలకు 9885 443624, 97035 23380 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.